TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-207 | పేజీలు:-4 | శనివారం 08-08-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR | KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

# చేనేతకు 50 ఏళ్లకే పింఛన్




- 1 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 1 71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సాయం
- 1 చీరాలలో 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- 1 ఎన్నికల సమయంలో హామీ ఇవ్వకున్నా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లు విడుదల
- 1 ఎన్నికల్లో చెప్పని హామీని కూడా నెరవేర్చామన్న ముఖ్యమంత్రి

**అమరావతి :**
చేనేతలను ఆదుకునేందుకే నేతన్నల నేస్తం పథకాన్ని తెచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు సాయం అందిస్తున్నామన్నారు. బాపట్ల జిల్లా కొత్తపేటలో 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వకున్నా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. సబ్సిడీపై చేనేత కార్మికులకు విద్యుత్ ఇస్తామన్న సీఎం, ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ - మిగతా 2 లో

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?



- 8 వైసీపీ అధినేత జగన్
- 8 డీఎస్సీ అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నామంటూ జగన్ ప్రకటన
- 8 లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆరోపణ
- 8 డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- 8 విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలన్న జగన్
- 8 విద్యా దీవెన బకాయిలు, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్

**అమరావతి :**
డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు - మిగతా 2 లో



## నేత కార్మికులకు అండగా నిలుద్దాం

- 8 ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- 8 జాతీయ చేనేత దినోత్సవం
- 8 నేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన పవన్
- 8 నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య

**అమరావతి :**
జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలోని నేత కార్మికులు, కళాకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశపు గొప్ప నేత వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్న నైపుణ్యం - మిగతా 2 లో

## భయపడొద్దు, నేనున్నాను ప్రధాని మోదీ భరోసా



- 8 టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా
- 8 ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్
- 8 టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని
- 8 "ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా
- 8 పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎంపీలకు సూచన

**ఢిల్లీ :**
ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన - మిగతా 2 లో

## పగలే రాత్రిగా మారే అద్భుతం



- 8 యూరప్‌లో దశాబ్దాల తర్వాత ఖగోళ వింత
- 8 2026 ఆగస్టు 12న ఏర్పడనున్న సంపూర్ణ సూర్యగ్రహణం
- 8 స్పెయిన్, ఐస్‌లాండ్‌లో పగలే రాత్రిగా మారనున్న వాతావరణం
- 8 గరిష్ఠంగా 2 నిమిషాల 18 సెకన్ల పాటు కొనసాగనున్న సంపూర్ణ గ్రహణం
- 8 గ్రహణ వీక్షణకు ప్రత్యేక కళ్లద్దాలు తప్పనిసరని శాస్త్రవేత్తల హెచ్చరిక

**ఢిల్లీ :**
ప్రపంచవ్యాప్తంగా ఖగోళ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సంపూర్ణ సూర్యగ్రహణం 2026 ఆగస్టు 12న ఏర్పడనుంది. ఈ - మిగతా 2 లో

## ఒక దేశంపై దాడి జరిగితే మూడుదేశాలపై దాడి జరిగినట్టే



- 8 పాక్, సౌదీ, టర్కీ మధ్య చారిత్రక ఒప్పందం
- 8 సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్థాన్ మధ్య 'మక్కా ఉమ్మడి రక్షణ ఒప్పందం'
- 8 పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నడుమ కీలక పరిణామం
- 8 మూడు ప్రధాన సున్నీ ముస్లిం దేశాల మధ్య బలపడుతున్న సైనిక బంధం
- 8 అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకునే వ్యూహంలో భాగంగా ఈ ఒప్పందం

**ఢిల్లీ :**
పశ్చిమాసియా భౌగోళిక రాజకీయాల్లో ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. , పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు శుక్రవారం పవిత్ర మక్కా నగరంలో 'మక్కా ఉమ్మడి రక్షణ ఒప్పందం'పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం, ఈ మూడు దేశాల్లో ఏ ఒక్కదానిపై సాయుధ దాడి జరిగినా, దానిని మూడు దేశాలపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. సామూహిక - మిగతా 2 లో

## రూ.500తో పాటు చిన్న నోట్లూ ఫేకే!



- 8 నకిలీ నోట్లపై ఆర్బీఐ కీలక నివేదిక
- 8 చిన్న నోట్లపై దృష్టి సారించిన దొంగనోట్ల ముఠాలు
- 8 ఈ కుట్ర వెనుక దావూద్ సిండికేట్, పాక్ ఐఎస్ఐ హస్తం ఉన్నట్లు నిఘా వర్గాల అనుమానం
- 8 రూ.20 నకిలీ నోట్లు 47.4 శాతం పెరిగాయని తెలిపిన ఆర్బీఐ
- 8 మొత్తం నకిలీ నోట్ల గుర్తింపు 5.7 శాతం పెరిగినట్లు వెల్లడి
- 8 అధికంగానే కొనసాగుతున్న రూ.500 నకిలీ నోట్ల దందా

**ఢిల్లీ :**
భారతదేశంలో నకిలీ కరెన్సీ చలామణిలో నేర ముఠాలు తమ వ్యూహాన్ని మార్చాయి. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో పనిచేసే దావూద్ ఇబ్రహీం నెట్‌వర్క్‌తో సహా ఇతర సిండికేట్లు, ఇప్పటివరకు రూ.500 వంటి పెద్ద నోట్లను లక్ష్యంగా చేసుకున్నాయి. అయితే, ఇప్పుడు తమ దృష్టిని రూ.10, రూ.20, రూ.50 వంటి తక్కువ విలువ కలిగిన నోట్లపైకి మళ్లించాయని భారత భద్రతా సంస్థలు గుర్తించాయి. మార్కెట్లోకి ఈ చిన్న - మిగతా 2 లో



## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

- 8 జాతీయ చేనేత దినోత్సవం వేళ రేవంత్‌కు కేటీఆర్ లేఖ
- 8 నేతన్న బీమా, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలను ఆపేశారని మండిపాటు
- 8 రద్దు చేసిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్

**హైదరాబాద్ :**
జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ - మిగతా 2 లో

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరి పోరు



- 8 బీజేపీ తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు
- 8 తెలంగాణలో ఎవరితోనూ పొత్తులు ఉండవని స్పష్టం చేసిన రామచందర్ రావు
- 8 రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై పోరాడాలని అధిష్ఠానం ఆదేశం
- 8 మండల, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి
- 8 తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు లక్ష్యమన్న నేతలు

**హైదరాబాద్ :**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఎన్. రామచందర్ - మిగతా 2 లో

# వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలి

- 8 ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో వరుణయాగం
- 8 వరుణయాగం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం
- 8 ముహూర్తం ఖరారు చేసిన యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు
- 8 దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ క్రతువులు
- 8 యాగం నిర్వహించనున్న యాదగిరిగుట్ట ఆలయ వేద పండితులు, అర్చకులు
- 8 పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఈ నెల 10న వరుణ యాగం నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయ విహార్ ప్రాంగణం వేదికగా ఈ యాగం చేయనున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఖరారు చేసిన ముహూర్తం ప్రకారం యాగ క్రతువులు నిర్వహించనున్నారు.10న సాయంత్రం జరిగే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని యాదాద్రి ధర్మకర్తల మండలి ఛైర్మన్ మన్నె సత్య నారాయణ రెడ్డి (ఎంఎస్?ఎన్? రెడ్డి) తెలిపారు. కృష్ణ, గోదావరి నదులు, రిజర్వాయర్లు, చెరువులు జలకళ సంతరించుకోవాలని, పాడి పంటలు బాగా పండాలనే సంకల్పంతో సీఎం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.ఆగస్టు 10న - మిగతా 2 లో

# సంపాదకీయం

## హసీనా సాహసం



ఆరునూరైనా ఈ ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్ వెళ్ళడం ఖాయమని ఆ దేశ మాజీ ప్రధాని షేక్‌హసీనా విస్పష్టంగా ప్రకటిం చారు. గతంలో కూడా ఇదేమాట అన్నప్ప టికీ, విలేకరుల సమావేశంలో చేసిన ప్రకటన కనుక దీనికి కచ్చితంగా ఎంతో విలువ ఉంది. స్వదేశం వదిలివచ్చి రెండేళ్ళు పూర్తవుతున్న సందర్భంగా బుధవారం ఢిల్లీలో ఆమె మీడియా సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. భారత్ పారిపోయివచ్చిన తరువాత, ఇక్కడనుంచి మీడియాను నేరుగా ఉద్దేశించి మాట్లాడటం ఇదే తొలిసారి. దీనిని జరగనివ్వకండని అనడం బాగుండదు కనుక, ఈ సమావేశంమీద భారత్ తన వైఖరిని స్పష్టంచేయాలని బంగ్లాదేశ్ డిమాండ్ చేసింది. 'ఫారిన్ కరెస్పాండెట్స్ క్లబ్ (ఎఫ్‌సీసీ) ఆఫ్ సౌత్ ఏసియా' నిర్వహిస్తున్న ఈ సమావేశంలో తన ప్రమేయమేమీ లేదని, అది ఒక ప్రైవేటు వ్యవహారమని భారతదేశం తేల్చేసింది. అందులో ఆమె వ్యక్తపరచబోయే అభిప్రాయాలతో తనకు నిమిత్తం లేదని భారత్ స్పష్టంచేయడంతో బంగ్లాదేశ్ ప్రధాని నుంచి మంత్రులూ దిగువస్థాయి నాయకులవరకూ అంతా సత్సంబంధాలు దెబ్బతింటాయంటూ హెచ్చరికలు చేస్తున్నారు, నర్మగర్భంగా ఏవేవో మాట్లాడుతున్నారు. హసీనా వ్యాఖ్యలు, ప్రసంగాలు, ఇంటర్వ్యూలు, ఆడియో వీడియో సందేశాలను ప్రచురించడం లేదా ప్రసారం చేయడాన్ని నిషేధిస్తూ, ఈ కట్టుతప్పినవారు కఠినశిక్షలకు అర్హులని బంగ్లాదేశ్ ప్రభుత్వం తన మీడియాను హెచ్చరించింది కూడా. అధికారంకోసం కాక, పతనమైపోతున్న బంగ్లాదేశ్‌ను తిరిగి నిలబెట్టేందుకే తాను స్వదేశానికి వెళ్ళదల్చుకున్నానని హసీనా ఈ సమావేశంలో చెప్పుకొచ్చారు. 2024 జులై--ఆగస్టు మధ్యకాలంలో జరిగిన విద్యార్థి ఉద్యమాన్ని కొందరు ఇతరత్రా లక్ష్యాలతో తప్పుదోవపట్టించి, హింసాత్మకంగా మార్చారని ఆరోపించారామె. తనను అధికారం నుంచి దించేయడానికి జరిగిన ఈ నిరసన వెనుక ఎవరి చేతులున్నాయో, ఏయే శక్తులున్నాయో చెప్పుకొచ్చారామె. ప్రస్తుత పాలకుల చేతిలో బంగ్లాదేశ్ 'నయా పాకిస్థాన్'గా అవతరిస్తోందని, పాకిస్థాన్ ఇంటలిజెన్స్ సంస్థ చక్రం తిప్పుతోందని అంటూ భారత్‌కు ప్రమాదకరంగా పరిస్థితులు తయారవుతున్నాయని ఆమె కుమారుడు సజీద్ వాజేద్ కూడా హెచ్చరిస్తున్నారు. రెండేళ్ళక్రితం హసీనా ఢిల్లీకి తరలివచ్చిన తరువాత బంగ్లాదేశ్‌లో సంభవించిన వరుస పరిణామాలతో ఉభయదేశాల సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాత్కాలిక పాలకుడుగా ఉన్న యూనిస్ రహ్మాన్ తనదేశాన్ని చైనా పాకిస్థాన్‌లకు చేరువచేసే పని ఆరంభించారు. బంగ్లాదేశ్ విముక్తిపోరాటాన్ని, పితామహుడు షేక్‌ముజబూర్ రహ్మాన్ చిహ్నాలను చెరిపివేసే ప్రయత్నాలు ఉధృతంగా సాగాయి. బీఎన్పీ అధికారంలోకి వచ్చిన తరువాత పాకిస్థాన్‌తో అంటకాగడం మరింత హెచ్చింది. వయసురీత్యా హసీనా గొంతు వణకవచ్చు, గతాన్ని గుర్తుచేసుకున్న పలు సందర్భాల్లో గద్గదస్వరంగా మారవచ్చు. అధికారకాంక్షతోనే ఆమె ఈ ప్రయాణం కట్టారని బంగ్లా ప్రస్తుత పాలకులు అంటున్నప్పటికీ, చావుకు సిద్ధపడి మరీ ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారన్నది నిజం. పొరుగుదేశంలో ఉంటూ కూడా ప్రభావం చూపగలుగుతున్న ఆమె, మళ్ళీ తిరిగివస్తే ఎలా వ్యవహరించాలో, పరిస్థితులు ఏ విధంగా మారతాయో వారికి అర్థంకాకుండా ఉంది. ఆమె తిరిగివచ్చి, జైల్లో ఉన్నా కూడా క్షేత్రస్థాయిలో దాని ప్రభావం విస్తృతంగా ఉంటుందనీ, సమర్థవంతమైన నాయకత్వాన్ని, చివరకు అధికారిక గుర్తింపునూ కోల్పోయిన ఆమె పార్టీకి జవజీవాలు వస్తాయని కొందరివాదన. జైలు నిర్బంధాలు బంగ్లాదేశ్‌కు కొత్త కాదు. ప్రస్తుత ప్రధాని తారీఖ్ రహ్మాన్ తల్లి, మాజీ ప్రధాని ఖలేదాజియా అవినీతి ఆరోపణలతో అనేక సంవత్సరాల పాటు ఢాకా జైల్లో ఉన్నారు. ఇప్పుడు హసీనా కూడా తాను స్వదేశంలో కాలూనగానే, తనను జైల్లో తోయవచ్చు, ప్రాణాలు తీయవచ్చునని అంటూనే, దేనికైనా సిద్ధపడే ఉన్నానని స్పష్టంచేస్తున్నారు. ఆమెను అప్పగించవలసిందిగా భారతదేశాన్ని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోయిందని, డిసెంబరులో తాము కోరినదే జరగబోతోందని బంగ్లాదేశ్ నాయకులు అంటున్నారు. తిరిగివస్తానంటున్న హసీనాను కోర్టులో లొంగిపోకముందే అరెస్టు చేస్తామని బంగ్లాదేశ్ న్యాయమంత్రి ఇప్పటికే తేల్చేశారు. మరణశిక్షపడిన ఆమెకు మళ్ళీ కోర్టులను ఆశ్రయించే అవకాశం దక్కనిచ్చేది లేదన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. భారతదేశానికి పలు సవాళ్ళు విసిరే డిసెంబరు పరిణామాలు ఊహకు అందనివి.

# చేనేతకు 50 ఏళ్లకే పింఛన్




**మొదటిపేజీ తరువాయి -** పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేశం గర్వించే కళ చేనేత కళ అని, మన రాష్ట్రం ఇలాంటి కళలకు నిలయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొత్తపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. మన నేత కార్మికులు అగ్గిపెట్టెలో పట్టే చీర తయారు చేశారని గుర్తు చేశారు. "చీరాల కర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు ఎగుమతి చేసేవారు. చీరాలను ఒకప్పుడు మినీ ముంబయి అనేవారు. అనేక చేనేత ఉత్పత్తులకు గుర్తింపు తీసుకొచ్చారు. 1.27లక్షల మంది ఈ రంగంపైనే ఆధారపడ్డారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు టీడీపీకే ఓటు వేశారు. సబ్సిడీపై చేనేతలకు విద్యుత్ ఇస్తామన్నాం, మాట నిలబెట్టుకున్నాం. చేనేతలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తున్నాం. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నాం. చేనేతలకు రూ.25 వేలు ఇస్తున్నాం. అన్ని వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలు ఇచ్చాం. ఎన్డీయే ప్రభుత్వం బీసీలకు రుణపడి ఉంది. తప్పకుండా మీ రుణం తీర్చుకుంటాం. సంజీవని పేరుతో రూ.2.50 లక్షల ఆరోగ్య బీమా ఇస్తున్నాం. ఎవరికీ ఇబ్బంది లేని పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చాం. రెండేళ్లలో మీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం" అని సీఎం చంద్రబాబు అన్నారు. "సూర్యలంక, బాపట్ల, చీరాలలో బెస్ట్ బీచ్‌లు ఉన్నాయి. శనివారం, ఆదివారం వస్తే హైదరాబాద్ నుంచి ఇక్కడి బీచ్‌లకే వస్తారు. మరో గోవా ఎక్కడో లేదు, చీరాల, సూర్యలంక మధ్యలో ఉంది. చీరాల పక్కన చిన్న ఎయిర్‌పోర్టు కడితే ప్రపంచం అంతా ఇక్కడికే రావాలి. రెండేళ్లలో సంక్షేమం కోసం రూ.లక్షా 50 వేలు ఖర్చు చేశాం. అభివృద్ధికి రూ.లక్షా 30 వేలు ఖర్చు చేశాం. ఒకప్పుడు పిల్లలంటే భారం, ఇప్పుడు పిల్లలంటే సంపద. రెండేళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయి. రూ.12 లక్షల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. రూ.12 లక్షల కోట్ల ప్రాజెక్టులు పూర్తయితే 12 లక్షల ఉద్యోగాలు వస్తాయి. చదువుకుంటే ఉద్యోగం వస్తుందనే నమ్మకాన్ని ఇస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు."

# డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?

**మొదటిపేజీ తరువాయి -**

పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు.

1. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి.
2. ప్రస్తుతం రూ.9,000 కోట్లకు చేరిన విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
3. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున గత రెండేళ్ల బకాయిలతో సహా నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలి. "చంద్రబాబు గారూ... మీరు దీక్షా శిబిరాలను ధ్వంసం చేయవచ్చు, పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయించవచ్చు. కానీ డీఎస్సీ లీకేజీ ఆధారాలను చెరిపేయలేరు. నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరు. న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు" అని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

# ఒక దేశంపై దాడి జరిగితే మూడుదేశాలపై దాడి జరిగినట్టే

**మొదటిపేజీ తరువాయి -**

రక్షణను బలోపేతం చేయడం, సైనిక సహకారాన్ని మరింత లోతుగా విస్తరించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. ఈ ఒప్పందంలో భాగంగా ఉమ్మడి సైనిక విన్యాసాలు, శిక్షణ కార్యక్రమాలు, రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, గూఢచార సమాచార మార్పిడి వంటి అంశాలు ఉన్నాయి. అయితే ఇది పూర్తిగా రక్షణాత్మక ఒప్పందమని, ఏ ఒక్క దేశానికీ వ్యతిరేకం కాదని టర్కీ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ కూటమిలో చేరాలనుకునే ఇతర ప్రాంతీయ భాగస్వాములకు తలుపులు తెరిచే ఉంటాయని, ఈ ఒప్పందం వల్ల టర్కీ నాటో సభ్యత్వం వంటి ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక, బహుపాక్షిక ఒప్పందాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన వివరించారు. మక్కాలో జరిగిన ఈ ఒప్పందంపై సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్దోగాన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంతకాలు చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఉమ్రా చేసేందుకు సౌదీ వచ్చిన షరీఫ్, ఈ ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ కూడా హాజరు కావడం గమనార్హం. దాదాపు ఏడాది కాలంగా జరుగుతున్న చర్చల ఫలితంగా ఈ ఒప్పందం రూపుదిద్దుకుంది. 2025 సెప్టెంబర్‌లో పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య జరిగిన వ్యూహాత్మక ఒప్పందానికి ఇది కొనసాగింపుగా భావిస్తున్నారు. ఈ మూడు దేశాల మధ్య దశాబ్దాలుగా బలమైన సైనిక సంబంధాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో ఇరాన్, దాని మిత్రపక్షాలైన హూతీలు, ఇరాకీ మిలీషియాల నుంచి సౌదీ, ఇతర గల్ఫ్ దేశాలపై క్షిపణి, డ్రోన్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఒప్పందం ప్రాధాన్యత సంతరించుకుంది. హర్మూజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో ఇంధన రవాణాకు ఆటంకాలు, ఇజ్రాయెల్–గాజా–లెబనాన్ ఉద్రిక్తతల నడుమ తమ భద్రతను పటిష్ఠం చేసుకునేందుకు ఈ దేశాలు ఏకమయ్యాయి. ముఖ్యంగా రక్షణ భాగస్వామ్యం కోసం కేవలం అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న సౌదీ అరేబియా దీర్ఘకాలిక వ్యూహంలో ఇది ఒక కీలక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కూటమిలోని మూడు దేశాలకు ప్రత్యేక బలాలు ఉన్నాయి. సౌదీ అరేబియాకు అపారమైన చమురు సంపద, ఇస్లాం పవిత్ర స్థలాలకు సంరక్షకుడిగా హోదా ఉంది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఏకైక ముస్లిం మెజారిటీ దేశం కాగా, టర్కీ నాటోలో రెండవ అతిపెద్ద సైన్యం, వేగంగా అభివృద్ధి చెందుతున్న రక్షణ పరిశ్రమను కలిగి ఉంది. మూడు ప్రధాన సున్నీ ముస్లిం దేశాలు భద్రతాపరంగా ఏకం కావడం రాజకీయంగా ఒక బలమైన సంకేతమని నిపుణులు పేర్కొంటున్నారు.

## నేత కార్మికులకు అండగా నిలుద్దాం

**మొదటిపేజీ తరువాయి -** కలిగిన చేతులకు గౌరవం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చేనేత వస్త్రం మన సంస్కృతికి, చేతిపనితనానికి, స్వావలంబన స్ఫూర్తికి ప్రతిరూపమని పేర్కొన్న ఆయన, చేనేతను ఎంచుకోవడం ద్వారా మన సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయవచ్చని చెప్పారు. చేనేత రంగానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం తనకు గర్వకారణమని వెల్లడించారు. చేనేత రంగానికి సాధికారత కల్పించేందుకు జనసేన పార్టీలో ప్రత్యేకంగా 'నేత కార్మికుల అభివృద్ధి విభాగం' ఏర్పాటు చేసినట్లు పవన్ తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉచిత విద్యుత్ తో పాటు రూ.25,000 ఆర్థిక సాయం అందించే 'నేతన్న సేవలో' పథకం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇదే క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ.. యువత, కంటెంట్ క్రియేటర్లు చేనేత దుస్తులు ధరించి వీడియోలతో ప్రచారం కల్పించాలని, ప్రతి భారతీయుడు చేనేతను దైనందిన జీవితంలో భాగం చేసుకుని నేతన్నలకు అండగా నిలవాలని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పిలుపునిచ్చారు.

## భయపడొద్దు, నేనున్నాను, ప్రధాని మోదీ భరోసా

**మొదటిపేజీ తరువాయి -** ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. "ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

## రూ.500తో పాటు చిన్న నోట్లూ ఫేకే!

**మొదటిపేజీ తరువాయి -** నకిలీ నోట్లను భారీగా చలామణిలోకి తెచ్చి, భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలనేది వారి ప్రణాళికగా తెలుస్తోంది. 'నకిలీ భారత కరెన్సీ నోట్ల' (ఎఫ్ఐసీఎన్) చలామణిని అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్న వేళ, ఈ కొత్త ధోరణి వెలుగులోకి వచ్చింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) విడుదల చేసిన 2025–26 వార్షిక నివేదిక ప్రకారం.. బ్యాంకింగ్ వ్యవస్థలో గుర్తించిన మొత్తం దొంగనోట్ల సంఖ్య 5.7 శాతం పెరిగింది. ముఖ్యంగా రూ.20 నకిలీ నోట్ల గుర్తింపు ఏకంగా 47.4 శాతం మేర పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు అత్యధికంగా చలామణిలో ఉన్న రూ.500 నకిలీ నోట్లు ఇప్పటికీ అధిక సంఖ్యలోనే పట్టుబడుతున్నాయి. అయితే, రూ.100, రూ.50 నకిలీ నోట్ల సంఖ్యలో కొంత తగ్గుదల కనిపించగా, ఇప్పటికే రద్దయిన రూ.2000 నకిలీ నోట్ల చలామణి గణనీయంగా క్షీణించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్బీఐ అప్రమత్తమైంది. నకిలీ నోట్లను గుర్తించే పద్ధతులపై బ్యాంకుల్లో నగదు నిర్వహణ సిబ్బందికి నిర్దేశిత గడువులోగా శిక్షణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లోని బ్రాంచ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. నకిలీ నోట్లను గుర్తించి, స్వాధీనం చేసుకోవడంలో విఫలమైతే, నోటు విలువను బట్టి జరిమానాలు ఉంటాయని హెచ్చరించింది. ఇటీవల దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన దాడుల్లో పెద్ద, చిన్న విలువ కలిగిన నకిలీ నోట్లు పట్టుబడగా, స్థానిక నెట్‌వర్క్‌ల ద్వారా వీటిని ముద్రిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెట్‌వర్క్‌లను అరికట్టేందుకు నిఘాను ముమ్మరం చేసినట్లు దర్యాప్తు సంస్థలు తెలిపాయి.

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

**మొదటిపేజీ తరువాయి -** హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, రూ.లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బోర్డులను రద్దు చేసి, జీఎస్టీ విధించి దెబ్బతీస్తే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలను నిలిపివేసి నేతన్నలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత వైఖరి వీడి, రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించి నేతన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

# పగలే రాత్రిగా మారే అద్భుతం

**మొదటిపేజీ తరువాయి -** అద్భుత దృశ్యం యూరప్ ప్రధాన భూభాగంపై దశాబ్దాల తర్వాత కనువిందు చేయనుండటం విశేషం. ఈ గ్రహణం సమయంలో చంద్రుడు సూర్యుడిని పూర్తిగా కప్పివేయడంతో, నిర్దిష్ట ప్రాంతాల్లో కొద్ది నిమిషాల పాటు పగలే రాత్రిని తలపించేలా వాతావరణం మారిపోతుంది. ఈ సంపూర్ణ సూర్యగ్రహణ మార్గం రష్యాలోని ఉత్తర ప్రాంతంలో ప్రారంభమై, ఆర్కిటిక్, గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్‌లోని పశ్చిమ భాగం మీదుగా ప్రయాణిస్తుంది. అనంతరం స్పెయిన్‌లోని ఉత్తర, తూర్పు ప్రాంతాలు, పోర్చుగల్‌లోని ఈశాన్య భాగంలోకి ప్రవేశిస్తుంది. దీంతో స్పెయిన్‌లోని బిల్బావో, జరగోజా, వాలెన్సియా, పాల్మా డి మల్లోర్కా వంటి నగరాలతో పాటు ఐస్‌లాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో పగటిపూట పూర్తి చీకట్లు అలుముకుంటాయి. సంపూర్ణ గ్రహణం గరిష్ఠంగా 2 నిమిషాల 18 సెకన్ల పాటు కొనసాగుతుందని అంచనా. స్పెయిన్‌లో సూర్యాస్తమయానికి ముందు సాయంత్రం వేళ ఈ గ్రహణం ఏర్పడుతుండగా, ఐస్‌లాండ్‌లో మాత్రం సూర్యుడు ఆకాశంలో ఎత్తులో ఉన్నప్పుడే కనిపిస్తుంది. సంపూర్ణ గ్రహణ మార్గంలో లేని ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణం కనిపిస్తుంది. యూరప్‌లోని యూకే, ఫ్రాన్స్, జర్మనీ, స్కాండినేవియా దేశాలతో పాటు ఉత్తర అమెరికాలోని కొన్ని భాగాలు, వాయువ్య ఆఫ్రికాలో పాక్షిక గ్రహణాన్ని వీక్షించవచ్చు. ఈ ప్రాంతాల్లో చంద్రుడు సూర్యుడిని పాక్షికంగా కప్పివేస్తాడు. గ్రహణం సమయంలో సూర్యుడి బాహ్య వాతావరణమైన 'కరోనా'పై అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే సమయంలో పెర్సీడ్ ఉల్కాపాతం కూడా గరిష్ఠ స్థాయికి చేరనుండటంతో ఆకాశంలో అద్భుత దృశ్యాలు ఆవిష్కృతం కానున్నాయి. సూర్యగ్రహణాన్ని నేరుగా కంటితో చూడటం అత్యంత ప్రమాదకరం. పాక్షిక గ్రహణం సమయంలో తప్పనిసరిగా ఐఎస్ఓ–సర్టిఫైడ్ ఎక్లిప్స్ గ్లాసెస్ లేదా ప్రత్యేక ఫిల్టర్లు ఉపయోగించాలి. కేవలం సంపూర్ణ గ్రహణ మార్గంలో ఉన్నవారు, సూర్యుడు పూర్తిగా కప్పబడిన ఆ కొద్ది నిమిషాలు మాత్రమే ఎలాంటి రక్షణ లేకుండా గ్రహణాన్ని వీక్షించవచ్చని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. మిగతా సమయాల్లో నేరుగా చూడటం వల్ల కంటి చూపు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలి



**మొదటిపేజీ తరువాయి -** సాయంత్రం 3:20 నుంచి 3:24 నిమిషాల మధ్య పూర్ణాహుతి కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారు. 108 మంది రుత్వికులు, 11 హోమగుండాలు, వేద పండితులు, అర్చక బృందం ఈ యాగంలో పాల్గొంటారని దేవాదాయ శాఖ తెలిపింది. రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ఎల్ నినో ప్రభావం తొలగిపోయి ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇతర ప్రాజెక్టుల్లో నీరు చేరినప్పటికీ శ్రీశైలం నుంచి నీటి విడుదల కాకపోవడంతో నాగార్జునసాగర్ ప్రస్తుతం డెడ్ స్టోరేజ్‌లోనే ఉంది. శ్రీశైలం నిండటానికి మరో వారం రోజులు పట్టే అవకాశం కనిపిస్తుంది. సాగర్ కింద దాదాపు 22 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండటంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా నిర్వహిస్తున్న వరుణ యాగంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. "ఈ నెల 10న వరుణ యాగం నిర్వహించాలని సీఎం రేవంత్ నిర్ణయం తీసున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో యాగం చేస్తాం. యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఈ వరుణ యాగానికి ముహూర్తం ఖరారు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ క్రతువుల నిర్వహణ ఉంటుంది. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో వరుణ యాగం ప్రారంభమవుతుంది. 10న సాయంత్రం జరిగే పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించతలపెట్టాం" – మన్నె సత్యనారాయణ రెడ్డి, యాదాద్రి ధర్మకర్తల మండలి ఛైర్మన్

# జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరి పోరు




**మొదటిపేజీ తరువాయి -** రావు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి పొత్తులు లేకుండానే బరిలోకి దిగుతామని ఆయన ప్రకటించారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో భేటీ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో బీజేపీ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. సరైన సమయం చూసి పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంలో పెరుగుతున్న అవినీతిపై పోరాడాలని, అధికారంలోకి వచ్చేందుకు పక్కా రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని జాతీయ నాయకత్వం తమకు సూచించినట్లు రామచందర్ రావు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళతామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు. అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో 'డబుల్ ఇంజిన్ సర్కార్'ను ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రాష్ట్రంలో పార్టీ బలాన్ని నిరూపించుకోవడానికి ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## తనను కలవాలన్న 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్ష నెరవేర్చిన సీఎం చంద్రబాబు



ముఖ్యమంత్రి చంద్రబాబు తన చీరాల పర్యటనలో మానవత్వాన్ని, కళ పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. తనను కలవాలని సోషల్ మీడియాలో కోరిన 90 ఏళ్ల వృద్ధురాలిని ప్రత్యేకంగా పిలిపించుకుని పలకరించడంతో పాటు, మగ్గంపై తన చిత్రాన్ని నేసిన చేనేత దంపతులను అభినందించారు. ఈ రెండు సంఘటనలు ఆయన పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివరాల్లోకి వెళితే, చీరాలకు చెందిన 90 ఏళ్ల పుష్పావతి అనే వృద్ధురాలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒక ఫోటో దిగాలన్న తన చిరకాల వాంఛను సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తం చేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. తన చీరాల పర్యటనలో తప్పకుండా కలుస్తానని ఎక్స్ వేదికగా హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, పర్యటన సందర్భంగా పుష్పావతిని ప్రత్యేకంగా పిలిపించి ఆప్యాయంగా మాట్లాడారు. ఆమెతో కలిసి ఫోటో దిగి ఆమె కోరికను నెరవేర్చారు. సీఎం తనను గుర్తుపెట్టుకుని పిలిచి మాట్లాడటంతో ఆ వృద్ధురాలు ఆనందంతో అబ్బురపడ్డారు. అదేవిధంగా, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన చేనేత కుటుంబం నాగేశ్వరరావు, లక్ష్మీ దంపతులు కూడా ముఖ్యమంత్రిని కలిశారు. వారు ఎంతో నైపుణ్యంతో మగ్గంపై వస్త్రం రూపంలో చంద్రబాబు చిత్రపటాన్ని నేశారు. వారి కళా ప్రతిభను చూసి ముగ్ధుడైన ముఖ్యమంత్రి, ఆ దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. వారి నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ ప్రోత్సాహం అందించారు. సామాన్యుల ఆకాంక్షలకు, కళాకారుల ప్రతిభకు సీఎం ఇస్తున్న విలువకు ఈ సంఘటనలు నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
శనివారం 08-08-2026

## నూతన కూకట్పల్లి సిఐ డి. స్వామి గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన కూకట్పల్లి జర్నలిస్టులు

శాలువాతో సత్కరించిన కూకట్పల్లి టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య




**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 7:** కూకట్పల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా డి. స్వామి గౌడ్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, కూకట్పల్లి టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు విద్యా వెంకట్, మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు కొండల్ రెడ్డి, కూకట్పల్లి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి (జనరల్ సెక్రటరీ) నాగుల అంజిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగార్జున, కూకట్పల్లి కార్యవర్గ సభ్యులు సుజాత, నవీన్, సభ్యులు కోటేష్ ,శివ రామ్, పుట్టి నగేష్, ప్రహ్లాద్ కుమార్, ఈరన్న, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంధం రాములు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌తో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్



**నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి,ఆగస్టు 07:** బోడుప్పల్ సర్కిల్, పోచారం డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ శుక్రవారం జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఈఈ రమేష్ బాబులను కలిసి చర్చించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులకు ప్రాధాన్యతనిచ్చి త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు బి. కళ్యాణ్, కర్రె రాజేష్, తుంగతుర్తి రవి, నాగారం కాంగ్రెస్ నాయకులు జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ శిక్షణ పొందుతున్న హైదరాబాద్ యువతి బలవన్మరణం



**నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు, 7:** కృష్ణా జిల్లా కానూరులోని శ్రీ భారతి ఇన్‌స్టిట్యూట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ సెంటర్‌లో మూడు వారాల కిందట నీట్ శిక్షణ కోసం చేరిన బేగంపేటకు చెందిన కంతేటి వైష్ణవి(19) ఇన్‌స్టిట్యూట్ హాస్టల్‌లోనే ఉంటూ, ఇటీవల ఇంటికి వెళ్లి రెండ్రోజుల తర్వాత తిరిగి వచ్చి, ఇంత దూరంలో ఉంటూ చదవలేననీ తనను ఇంటికి తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు ఫోన్ చేసిన వైష్ణవి వారు ఆమెకు నచ్చజెప్పగా, ఈనెల 4న తనకు ఆరోగ్యం బాగోలేదని కాలేజీకి వెళ్లకుండా హాస్టల్ రూంలో ఫ్యానుకు ఉరేసుకొని వైష్ణవి బలవన్మరణం రాత్రి 9 గంటలకు యువతితో పాటు ఉండే ఇద్దరు విద్యార్థినులు తెలపడంతో, కాలేజీ సిబ్బంది రూం తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే వైష్ణవి మృతి

## కూల్చడంతో పాటు అరెస్టులు చేయండి:సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 7:** జగద్గిరిగుట్ట సర్వేనెంబర్ 348 /1 లో ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వెంటనే వాటిని కాపాడాల్సిందిగా నేడు సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ఎమ్మార్వో రాజేష్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఎమ్మార్వో కి జగద్గిరిగుట్ట 348/1 లో జాంబవంతుని గుడి స్థలంలో గతంలో కూల్చివేసినప్పటికీ మళ్లీ మళ్లీ నిర్మాణాలు సాగుతున్నాయని, ఇలాగా అనేక ప్రాంతాల్లో కొనసాగుతున్నాయని కావున కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన స్థలాలను హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం వెంటనే సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని లేకపోతే ఉన్న ప్రభుత్వ భూమి కూడా ప్రైవేట్ వ్యక్తుల చేతిలో వెళ్లే ప్రమాదం ఉందని దానివల్ల భవిష్యత్ తరాలకు ప్రభుత్వ భూమి అనేది లేకుండా పోతుందని అన్నారు. రాజీవ్ గృహకల్ప లోని షాపింగ్ కాంప్లెక్స్ కేటాయించిన భూమిని కూడా పట్టాలు ఉన్నాయని నెపంతో ఆక్రమించుకుంటున్నారని ఆ పట్టాలు నిజమో కావో తెలుసుకొని ఫేక్ పట్టాలో సూచించిన వారి పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని, సోమయ్య నగర్ సలాసర్ స్థలం అనుకొని చిన్న ప్లాట్లుగా చేసి అమ్ముతున్నట్టు ప్రచారం జరుగుతుందని, వేద పాఠశాల నుండి వెళ్లే దారి పక్కన స్థలాలు కూడా ఆక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వెంటనే వాటిని కూల్చివేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మండల కార్యదర్శి స్వామి సహాయ కార్యదర్శి రాములు ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మండల కోశాధికారి సదానందలు పాల్గొన్నారు.

## నిజాంపేట్ సర్కిల్ రాజీవ్ గృహ కల్పలో రోడ్లను వెంటనే బాగు చేయాలి



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 7:** గత సంవత్సరం నుండి అధికారుల నిర్లక్ష్యం వల్ల బురద మైయం అయినా అర్జీకే రోడ్డులు సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహ కల్పలో గత సంవత్సరం నుండి బురద మైయం అయినా అధికారులు ఇటు వైపు రాకపోవడంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని సిపిఐ ఆధ్వర్యంలో రాజీవ్ గృహ కల్ప బ్లాక్ నెంబర్. 72 వద్ద నిరసన ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంత మంది స్థానిక నాయకులు వచ్చిన మా రోడ్లు బాగు అవ్వటం లేదు అని స్థానిక ప్రజలు చెప్పడంతో అర్జీకే బ్లాక్ నెంబర్ 72 వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించము అని వారు అన్నారు. ఇక్కడ గత అనేక నెలలుగా రోడ్డు బురదతో నిండి పోయింది అని గుర్తు చేశారు. ఇంత కాలం అవుతున్న మున్సిపల్ అధికారులు అర్జీకే రోడ్డును బాగుచేయకపోవడం బాధాకరం అని అన్నారు. కనుక రాజీవ్ గృహ కల్ప రోడ్డును వెంటనే బాగు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అలాగే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే బద్లావ్ జరూరి హై ఛలో ఢిల్లీ కార్యక్రమని జయప్రదం చేయాలనీ వారు కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ ఏఐటీయూసీ కన్వీనర్ పొన్నకంటి దస్తగిరి, రేణుక, రమాదేవి, విజయ లక్ష్మి, స్వాతి, నవనీత, పూజ, పప్పీ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై సహచరి గ్రూప్ సభ్యులకు అవగాహన

ప్రతి సభ్యుడులిలి కమ్యూనిటీ సేఫ్టీ అంబాసిడర్‌లిలి గా ఉండాలన్న

సిఐ జలేందర్ రెడ్డి





**నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి,ఆగస్టు 07 :** సహచరి గ్రూపు సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించిన మేడిపల్లి పోలీసులు మేడిపల్లి, సమాజ భాగస్వామ్య పోలీసింగ్ (కమ్యూనిటీ పోలీసింగ్ ) కార్యక్రమంలో భాగంగా నేడు మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి. జలేందర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సహచరి గ్రూపు సభ్యులతో మేడిపల్లిలోని పాత పీఎంసీ కార్యాలయంలో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో మహిళల భద్రత, రోడ్డు భద్రత, నేరాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, కమ్యూనిటీ పోలీసింగ్ ప్రాముఖ్యత, అత్యవసర పరిస్థితుల్లో అనుమాన్సపద్ధ వ్యక్తుల కధలీకల గురించి పోలీసులకు వెంటనే సమాచారం అందించడం వంటి అంశాలపై సభ్యులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, ఫోన్ కాల్స్, ఓటీపీ లు, నకిలీ లింకులు, డిజిటల్ లావాదేవీలలో మహిళల పై జరిగే నేరాలు, డ్రగ్స్ గురుంచి ,పబ్లిక్ బూజింగ్ మరియు దొంగతనాలు అరికట్టడం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.అదేవిధంగా, ప్రజలు, పోలీసుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంలో సహచరి గ్రూపు సభ్యుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. తమ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల్లో భద్రతా అవగాహన పెంపొందించేందుకు చురుకుగా పనిచేయాలని, ప్రతి సభ్యుడు లి"కమ్యూనిటీ సేఫ్టీ అంబాసిడర్"లిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న సహచరి గ్రూపు సభ్యులు మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, నేర నియంత్రణ కార్యక్రమాల్లో పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రకృతి ఒడిలో పరవశించే బోనాలు...!

విశిష్టతను మర్చిపోతున్న జనాలు..!!

మందు, విందు చిందు, డీ జే లకే జై కొడుతున్న

"మర" మనుషులు...!!!

బోనం చేయడానికి పెద్దగా ఆసక్తి చూపని

ఆడపడుచులు..!

సంస్కృతి సాంప్రదాయాలను పక్కదారి

పట్టించవదంటున్న పెద్దలు..

మల్దే శ్రీశైలం సీనియర్ జర్నలిస్ట్ ???



**నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 7:** ప్రకృతి ఒడిలో పరవశించే అతి ముఖ్యమైన పండుగలల్లో బోనాల పండుగ ఒకటి. అలాంటి తెలంగాణ బోనాల వేడుకలకు దేశవ్యాప్తంగా ఎంతో క్రేజీ ఉంది. పట్టణం నుంచి పల్లె దాకా ఊరు వాడ ఉవ్వెత్తున ఎగిసిపడే ఉత్సాహం ఇది. ముఖ్యంగా ఆడపడుచులు తమ నెత్తిపై బోనాలు పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పిస్తారు. వివిధ రకాల అంటువ్యాధులు, ఇతర ప్రకృతి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తమను రక్షించమని భక్తితో కోరే సహజ సిద్ధమైన వేడుక. ప్రకృతి గ్రామదేవతలైన మహంకాళి, పోచమ్మ,, ఎల్లమ్మ వంటి గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో పూజించాల్సిన ప్రకృతి పండుగ. కానీ రోజురోజుకు బోనాల వేడుకలు పక్కదారి పడుతున్నాయి. భక్తి భావాన్ని కనుమరుగు చేస్తూ కొత్త కల్చర్ కు కనెక్ట్ అవుతున్నాయి. ప్రకృతితో పవిత్రంగా ఉండాల్సిన మానవ బంధాలు బీటలు వారుతున్నాయి..!

**బోనాల విశిష్టతను మర్చిపోతున్న జనాలు..!**

తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగ విశిష్టతను మనం రోజురోజుకు మర్చిపోతున్నాం. ఆషాఢ మాసంలో ప్రారంభమయ్యే ఈ వేడుకలు మానవ సంబంధాలను మరింత దగ్గరగా చేస్తుంది.

**బోనం అంటే అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో భోజనం సమర్పించడం.**

కొత్త కుండలో అన్నం, పాలు, బెల్లం వండి పసుపు, కుంకుమ, వేపాకులు, పైన దీపంతో మహిళలు ఈ బోనాలను తలపై మోస్తూ భక్తితో ఆలయాలకు వెళ్లి అమ్మవారికి సమర్పిస్తారు. మహాకాళి, పోచమ్మ, ఎల్లమ్మ వంటి గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో భోజనం (నైవేద్యం) సమర్పించే పవిత్రమైన రాష్ట్ర పండుగ. ఇది వ్యాధుల నుండి రక్షణ కోరుతూ, అమ్మవారికి కృతజ్ఞతలు తెలిపే గొప్ప సాంస్కృతిక జాతర. మహిళలు ఈ బోనాలను తలపై మోస్తూ భక్తితో ఆలయాలకు వెళ్లి అమ్మవారికి సమర్పిస్తారు. అమ్మవారి తమ్ముడిగా భావించే పోతురాజు గజ్జెలతో, ఉత్సాహంగా నృత్యం చేస్తూ జాతరను ముందుండి నడిపిస్తాడు. అమ్మవారి రూపంగా భావించే రాగి లేదా పిత్తడి ఘటాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్తారు. శివసత్తులు పూనకంతో భవిష్యత్తును చెప్పే ప్రత్యేకమైన మరియు ప్రాచీనమైన ఆచార సాంప్రదాయాలకు నిలవెల్పు ఈ బోనాల వేడుకలు...!

**మందు, విందు, చిందు, డీజేలకే జై కొడుతున్న జనాలు**

బోనాల విశిష్టతను కొంతమంది జనాలు మర్చిపోతున్నారు. బోనాల ఊరేగింపులో కొత్త సందడిని నెలకొల్పుతున్నారు. మందు, విందు, చిందు, డిజేలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. భక్తి భావాన్ని పెంపొందించుకోవాల్సింది పోయి కల్తీ భావానికి కదం తొక్కుతున్నారు. యువతి, యువకులు, మహిళా మణులు అన్న తేడా లేకుండా అసలు కల్చర్ కు ఎసరు పెడుతున్నారు. ఇతర మతాలకు, సమాజానికి ఆదర్శంగా జరుపుకోవాల్సిన బోనాల వేడుకల తంతు ప్రశ్నార్ధకంగా మారుతోంది. ప్రాచాత్య దేశాలు మన కల్చర్ను అవలంబిస్తుంటే మనం మాత్రం మన కల్చర్ను కాలగర్భంలో కల్పేస్తున్నామా? అన్న సందేహం సంతరించుకుంటుంది.

సంస్కృతి సాంప్రదాయాలను మర వద్దంటున్న పెద్దలు

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబమైన బోనాల విశిష్టత ఎంతో గొప్పదని, మన పూర్వీకుల నుంచి తరతరాలుగా వస్తున్న ఈ ఆచార వ్యవహారాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని పెద్దలు సూచిస్తున్నారు. ట్రెండు మారుతున్నా కూడా మన కల్చర్ ను మార్చుకోవద్దని హితవు పలుకుతున్నారు. మాయదారి పోకడల మోజులో పడకుండా..మానవ విలువలను కాపాడుతూ ప్రకృతితో మమేకమైన మా "నవ" బంధాలను భద్రపరుస్తూ.. బాధ్యతాయుతంగా నడుచుకుంటూ.. సంస్కృతి సంపదను భావి తరాలకు భద్రంగా అందించాల్సిన గురుతరమైన బాధ్యత మనందరిదని గుర్తు చేస్తున్నారు.

## అన్యాయం జరిగిన కార్మికులకు అండగా నిలుస్తా...బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 7:** జెఆర్ ఇన్ఫ్రా ఆర్ఎంసి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లో ఓనర్ జనార్దన్ రావు, దగ్గర గత కొన్ని నెలల నుంచి కార్మికుడు మహేష్ కుమార్ సింగ్ పనిచేసేవారు, కార్మికుడు మహేష్ కుమార్ ఓనర్ జనార్దన్ రావు అక్టోబర్ నెల వేతనం ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో, కార్మికుల హక్కులను కాపాడేందుకు నిరంతర పోరాటం చేపడుతున్నాడని తోటి కార్మికుల ద్వారా తెలుసుకొని బి ఆర్ టి యు కార్మిక నాయకుడు రవి కార్యాలయం వద్దకు వెళ్లి మహేష్ కుమార్ సింగ్ కి జరిగిన అన్యాయం వివరించారు, వెంటనే స్పందించిన రవి హుటాహుటిన ఓనర్ జనార్దన్ రావు తో మాట్లాడి మహేష్ కు రావలసిన అక్టోబర్ నెల వేతనం కార్మికుడు మహేష్ కుమార్ కు చెక్ రూపంలో ఆ వేతనం ఇవ్వడం జరిగింది... కార్మికుడు మహేష్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు....

## ప్రజలకు -- ప్రజాప్రతినిధులకు మధ్య వారధిగా మీడియా సేవలు అమూల్యం : బండి రమేష్



**నిజం న్యూస్ కూకట్‌పల్లి ప్రతినిధి, ఆగస్టు 7:** 10 టీవీ ప్రతినిధి హరి జన్మదినం సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, జన్మదిన కేక్ కట్ చేయించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలో, ప్రజలకు -- రాజకీయ నాయకులకు మధ్య వారధిగా మీడియా ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తోందని అన్నారు. సమాజాభివృద్ధిలో మీడియా సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలకు సంబంధించిన ఏ సమస్య ఎదురైనా మీడియా ప్రతినిధులు తన దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని బండి రమేష్ హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, పిడికిటి గోపాల్ చౌదరి, బీసీ నాయకులు తెల్ల హరికృష్ణ, విలేకరులు రాకేష్, సత్య, భాను, అనిల్, రంజిత్, శంకర్, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు నాగార్జున, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకురాలు రమణ, మహేష్, వాసు, కృష్ణవేణి, జ్యోతి తదితరులు పాల్గొని హరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

### మూడోరోజు స్టాక్ మార్కెట్ల పతనం

## 502.25 పాయింట్లు దిగజారిన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్ల పతనం కొనసాగుతున్నది. యూఎస్ ఫెడ్ రిజర్వ్ త్వరలోనే వడ్డీ రేట్లపై నిర్ణయం ప్రకటించనున్నది. ఈ సారి వడ్డీ రేట్లలో కోత విధింవచ్చున్న ఊహాగానాలున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. అదే సమయంలో రూపాయి పతనం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మదుపరులు లాభాల స్వీకరణకు దిగుతుండడంతో మార్కెట్లన్నీ కుదేలవుతున్నాయి. బుధవారం వరుసగా మూడో రోజు మార్కెట్లు నష్టపోయాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,666.26 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే సెన్సెక్స్ నష్టాల్లోకి జారుకున్నది. ఇంట్రాడేలో 80,868.02 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. 80,050.07 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది. చివరకు 502.25 పాయింట్ల నష్టంతో 80,182.20 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 137.15 పాయింట్లు పతనమై.. 24,198.85 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,379 షేర్లు పురోగమించాయి. మరో 2,456 షేర్లు పతనం కాగా.. మరో 92 షేర్లు మారలేదు. ఇక సెక్టోరల్ ఫ్రంట్‌లో ఫార్మా ఒకశాతం పెరిగింది. ఆటో, ఎనర్జీ, పీఎస్‌యూ బ్యాంక్, మెటల్, మీడియా, రియాల్టీ 0.5 శాతం నుంచి 2 శాతం వరకు దిగజారాయి. నిఫ్టీలో ట్రెంట్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సిప్లా, విప్రో, బజాజ్ ఆటో లాభాల్లో సాగగా.. టాటా మోటార్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, పవర్ గ్రిడ్ కార్ప్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎన్‌టీపీసీ నష్టపోయాయి. బీఎస్‌ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.5 శాతం చొప్పున తగ్గాయి.

## స్కోడా కార్లు ప్రియం




స్కోడా కూడా వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఉత్పత్తి వ్యయంతోపాటు నిర్వహణ ఖర్చులు పెరగడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని, ఈ నూతన ధరలు జనవరి 1 నుంచి అమలులోకి రానున్నట్లు పేర్కొంది. ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన కైలాక్ మాడల్ ఈ పెంపు నుంచి మినహాయింపునిచ్చింది. దీంతో కుషక్, స్లావియా, సూపర్బ్, కొడిక్యూ మాడళ్లు మరింత ప్రియంకానున్నాయి. అలాగే జీప్, సిట్రోయిన్ మాడళ్ల ధరలను కూడా 2 శాతం పెంచుతున్నట్లు స్టెల్లాంటిస్ పేర్కొంది.

### టాప్ మేనేజ్మెంట్ పేరిట డీప్ ఫేక్ వీడియోలు

## నమ్మొద్దని కస్టమర్లకు ఎస్బీఐ హెచ్చరికలు

బ్యాంకు మేనేజ్‌మెంట్‌కు చెందిన వ్యక్తులవి అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న డీప్ ఫేక్ వీడియోలను నమ్మొద్దని ఎస్బీఐ కస్టమర్లను హెచ్చరించింది. ఆయా వీడియోల్లో పేర్కొన్న పథకాలతో బ్యాంకుకు గానీ, బ్యాంకు అధికారులకు గానీ ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఫలానా పథకంలో పెట్టుబడి పెట్టాలంటూ సదరు వీడియోలో సలహాలు ఇస్తున్నారని, ఇటువంటి అసాధారణ, అవాస్తవమైన రాబడి ఇచ్చే హామీలను ఎస్బీఐ చేయబోనది పేర్కొంది. కనుక ఇటువంటి మోసపూరిత వీడియోల భారీన పడకుండా అప్రమత్తంగా ఉండాలంటూ 'ఎక్స్ (మాజీ ట్విట్టర్)' వేదికగా ఎస్బీఐ పోస్ట్ పెట్టింది. భారీ రిటర్నులు లభిస్తాయంటూ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా టాప్ మేనేజ్‌మెంట్ చెబుతున్నట్లు రూపొందించిన వీడియోలు సోషల్ మీడియా వేదికలపై హల్ చల్ చేస్తున్నాయి. దీనిపై స్పందించిన ఎస్బీఐ.. ఇవన్నీ నకిలీ వీడియోలని స్పష్టం చేస్తూ ఎక్స్ వేదికగా ప్రజలను అప్రమత్తం చేసింది.

### పోకో నుంచి మరో ఎంట్రీ లెవల్ స్మార్ట్

## ఫోన్ పోకో ఎం7 ప్రో 5జీ ఇవీ డిటెయిల్స్




ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ పోకో తన పోకో ఎం7 ప్రో 5జీ ఫోన్‌ను భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.13,999 పలుకుతుంది. అత్యంత అందుబాటు ధరలో ఉన్న స్మార్ట్ ఫోన్ ఇదే. 6.67 అంగుళాల ఫుల్ హెచ్డీం డిస్ ప్లే, మీడియాటెక్ డైమెన్సిటీ 7025 అల్ట్రా ఎస్వోసీ, 45వాట్ల ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5110 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తుంది. ఇందులో డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ ఉంటుంది. పోకో ఎం7 ప్రో 5జీ ఫోన్ 6 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.13,999, 8 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.15,999 పలుకుతుంది. ఆలివ్ ట్విలైట్, లావెండర్ ఫ్రాస్ట్, లునార్ డస్ట్ పవర్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఈ నెల 20 నుంచి ఫోన్ల అమ్మకాలు ప్రారంభం అవుతాయి. 2160 హెర్ట్జ్ టచ్ శాంప్లింగ్ రేటు, 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 6.67-అంగుళాల ఫుల్ హెచ్డీం డిస్ ప్లే కలిగి ఉంటది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 5 ప్రొటెక్షన్ స్క్రీనింగ్ ఉంటుంది. 2100 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. మీడియాటెక్ డైమెన్సిటీ 7025 అల్ట్రా ఎస్వోసీ ప్రాసెసర్‌తో పని చేస్తుంది. ఆండ్రాయిడ్ 14 బేస్డ్ హైపర్ ఓఎస్ ఔటాఫ్ బాక్స్ వర్షన్‌పై పని చేస్తుంది. రెండేండ్ల పాటు ఆండ్రాయిడ్ ఓఎస్ అప్‌డేట్స్, నాలుగేండ్లు సెక్యూరిటీ అప్‌డేట్స్ అందిస్తామని పోకో తెలిపింది. 50-మెగా పిక్సెల్ సోనీ ల్వైతియా ఎల్వైటీ 600 ప్రైమరీ సెన్సర్, 2-మెగా పిక్సెల్ మాక్రో సెన్సర్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 20-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. సెక్యూరిటీ కోసం ఇన్-డిస్ ప్లే ఫింగర్ ప్రింట్ స్కానర్, 5జీ, డ్యుయల్ బాండ్ వై-ఫై కనెక్టివిటీ కలిగి ఉంటుంది.

# మార్కెట్లకు ఫెడ్ గుబులు



### అమ్మకాల ఒత్తిడిలో మదుపరులు
### 81వేల దిగువకు సెన్సెక్స్
### 1,064 పాయింట్లు డౌన్
### 332 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ వరుస నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యసమీక్ష నేపథ్యంలో మదుపరులు ఆచితూచి స్పందిస్తున్నారు. అయితే మెజారిటీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో మంగళవారం సూచీలకు భారీ నష్టాలు తప్పలేదు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,064.12 పాయింట్లు లేదా 1.30 శాతం క్షీణించి 81వేల మార్కుకు దిగువన 80,684.45 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలోనైతే 1,136.37 పాయింట్లు పతనమైంది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 332.25 పాయింట్లు లేదా 1.35 శాతం పడిపోయి 24,336 వద్ద నిలిచింది. సోమవారం కూడా సెన్సెక్స్ 384.55 పాయింట్లు, నిఫ్టీ 100.05 పాయింట్లు దిగజారిన విషయం తెలిసిందే.

**ఊగిసలాటలో...**

క్రయవిక్రయాల నడుమ మదుపరులు ఊగిసలాటకు లోనయ్యారు. దీని వెనుకున్న కారణాలను విశ్లేషిస్తే.. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లు ద్రవ్యసమీక్షలు చేసి వడ్డీరేట్లపై నిర్ణయాలను ప్రకటించబోతున్నాయి. దీంతో స్టాక్, బాండ్ మార్కెట్లతోపాటు పెట్టుబడి తీరుతెన్నులు ప్రభావితం కానున్నాయి. గతంలో వడ్డీరేట్లను తగ్గించినప్పటికీ.. ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ఇకపై వడ్డీరేట్లను ఫెడ్ రిజర్వ్ పెంచవచ్చున్న అంచనాలు మదుపరులను భయపెడుతున్నాయి. కాగా, జపాన్, ఇంగ్లాండ్ బ్యాంకులు ఇప్పుడున్న వడ్డీరేట్లనే కొనసాగించే వీలుందంటున్నారు. మరోవైపు భారతీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపరులు అదేపనిగా పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, అంతర్జాతీయంగా మెజారిటీ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోనే కదలాడటం కూడా దెబ్బతీసింది. ఉదయం ఆరంభం నుంచే మార్కెట్లు నష్టాల్లో కదలాడాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ వంటి ప్రధాన షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. టెలికం సూచీ అత్యధికంగా 2.18 శాతం పడిపోయింది.

**5 లక్షల కోట్లు ఆవిరి...**

స్టాక్ మార్కెట్ నష్టాలతో ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల్లో దేశ, విదేశీ మదుపరుల సంపద హరించుకుపోయింది. బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4,92,644.06 కోట్లు తగ్గి రూ.4,55, 13,913.24 కోట్లకు క్షీణించింది. రెండు రోజుల్లో సుమారు 6 లక్షల కోట్లు ఆవిరైంది.

**నష్టాలకు ప్రధాన కారణాలు**

**సెంట్రల్ బ్యాంకుల ద్రవ్యసమీక్ష నిర్ణయాలపై భయాలు**

**లాభాల స్వీకరణలో మదుపరులు**

**తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు**

**అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతలు**

**ప్రధాన షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

# అంబుజాలోకి సంఘీ, పెన్నా

### విలీనం చేయనున్న అదానీ గ్రూప్
### ఏకం కానున్న సిమెంట్ తయారీ సంస్థలు

అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్స్‌లో సంఘీ ఇండస్ట్రీస్, పెన్నా సిమెంట్ విలీనం కానున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో సంఘీ, ఈ ఏడాది ఆగస్టులో పెన్నాలను గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ సొంతం చేసుకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సిమెంట్ తయారీ కార్యకలాపాలను ఒక్కచోటికి చేర్చాలని గ్రూప్ భావిస్తున్నది. ఇందులో భాగంగానే ఈ మూడు సిమెంట్ తయారీ సంస్థలను కలిపేయాలన్న నిర్ణయానికి వచ్చింది. షేర్‌హోల్డర్లు, రెగ్యులేటర్ల అనుమతుల దృష్ట్యా 9 నుంచి 12 నెలల్లో ఈ విలీన ప్రక్రియ పూర్తికాగలదన్న ఆశాభావాన్ని అదానీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

**విలీనం ఇలా..**

ప్రస్తుతం అంబుజా సిమెంట్స్‌కు సౌరాష్ట్ర కేంద్రంగా నడుస్తున్న సంఘీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఎస్ఐఎల్), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (పీసీఐఎల్)లు అనుబంధ సంస్థలుగా ఉన్నాయి. దీంతో వీటిని తమలో విలీనం చేసుకునేందుకు వేర్వేరు పథకాలను ప్రకటించనున్నామని అంబుజా వర్గాలు చెప్తున్నాయి. తాజాగా జరిగిన సమావేశంలో అంబుజా సిమెంట్ బోర్డు కూడా ఈ స్కీములకు ఆమోదం తెలిపింది. కాగా, సంఘీ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో అంబుజాకు 58.08 శాతం వాటా ఉన్నది. దీని ప్రకారం అర్హులైన సంఘీ షేర్‌హోల్డర్లకు రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతీ 100 ఎస్ఐఎల్ ఈక్విటీ షేర్లకుగాను.. రూ.2 ముఖ విలువ కలిగిన 12 ఈక్విటీ షేర్లను అంబుజా జారీ చేయనున్నది. అలాగే పెన్నా ఈక్విటీ షేర్‌హోల్డర్లకు రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతీ ఫుల్లీ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌కు రూ.321.50 చొప్పున అంబుజా చెల్లించనున్నది.

**గట్టి పోటీ...**

సంఘీ, పెన్నాల విలీనంతో ఆదిత్యా బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్‌కు మార్కెట్‌లో ఉత్పత్తి, అమ్మకాలు, కార్యకలాపాల దృష్ట్యా గట్టి పోటీని ఇవ్వడానికి వీలవుతుందని కూడా అదానీ గ్రూప్ యోచిస్తున్నది. కాగా, 2022 సెప్టెంబర్‌లో అదానీ గ్రూప్ దాదాపు రూ.51,000 కోట్లతో అంబుజా సిమెంట్స్‌ను కొన్న సంగతి విదితమే. ఇక ఏసీసీ లిమిటెడ్‌లో అంబుజా సిమెంట్స్‌కు 51 శాతం వాటా ఉన్నది. రూ.31,000 కోట్లతో మరో 26 శాతం అదనపు వాటానూ కొనేందుకు సిద్ధమయ్యారు.



బంగారం అంటే మహిళలకు ఎంతో మక్కువ. ప్రతి ఒక్కరూ పండుగలు, కుటుంబ శుభకార్యాలకు బంగారం కొనుగోలు చేయాలని తలపోస్తారు. సాధ్యం కాకుంటే ఉన్న బంగారం ఆభరణాలే ధరిస్తారు. కానీ, కొనేండ్లుగా బంగారం ఆభరణాల వినియోగం క్రమంగా వృద్ధి చెందుతోంది. దీనికి తోడు దేశీయంగా బంగారం దిగుమతిపై సుంకాల తగ్గింపు.. అంతర్జాతీయ మార్కెట్లతోపాటు దేశీయంగా బంగారం ధరల్లో ఒడిదొడుకులు.. వినియోగదారుడి సెంటిమెంట్ బలోపేతం.. పెండ్లిండ్లూ పండుగల సీజన్ల నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో బంగారం ఆభరణాల వినియోగం 14-18 శాతం పెరుగుతుందని ప్రముఖ రేటింగ్ సంస్థ 'ఇక్రా' అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో బంగారం ఆభరణాల వినియోగం 18 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ద్వితీయ త్రైమాసికంలో బంగారం కడ్డీలు, బంగారం నాణెల కొనుగోళ్లు పెరిగాయి. 2024 జూలైలో బంగారం దిగుమతిపై సుంకం 900 బేసిక్ పాయింట్లు తగ్గించడం, దరిమిలా కొంతకాలం బంగారం ధరల్లో సర్దుబాట్లు నమోదయ్యాయి. సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరంలో ద్వితీయ త్రైమాసికంలో బంగారం ఆభరణాల కొనుగోళ్లు బలహీనంగా ఉంటాయి. కానీ, సుంకాల తగ్గింపుతోపాటు నైరుతి రుతుపవనాల్లో వర్షాలు కురవడం, పవిత్ర దినాలు, పెండ్లిండ్ల సీజన్ నేపథ్యంలో బంగారం ఆభరణాలకు గిరాకీ పెరిగింది. సంఘటిత మార్కెట్లో సానుకూల వాతావరణం నెలకొంది. ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాల్లో స్టోర్ల ఏర్పాటుకు వివిధ జ్యువెల్లరీ సంస్థలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలోనూ పవిత్ర దినాలు ఎక్కువగా ఉండటం వల్ల బ్రాండెడ్ బంగారం ఆభరణాలకు గిరాకీ పెరుగుతున్నదని ఇక్రా తెలిపింది. జూలైలో దిగుమతి సుంకాలు తగ్గింపు, నవంబర్ నెలలో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత స్వల్పకాలం బంగారం ధరల్లో సర్దుబాటు నెలకొంది. గత ఏడు త్రైమాసికాలుగా బంగారం ధరలు పెరుగుతూ వస్తున్నాయి. గ్లోబల్ ఆర్థిక రంగాల్లో ఒడిదొడుకులు, భౌగోళిక ఉద్రిక్తతలతో బంగారంపై ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.

## బంగారం ఆభరణాల వాడకం
## బాగానే పెరుగుతోంది ఇక్రా అంచనా

### స్టాక్ మార్కెట్లు క్రాష్ వెయ్యి

## పాయింట్లకుపైగా పతనమైన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు క్రాష్ అయ్యాయి. సెన్సెక్స్ వెయ్యి పాయింట్లకుపైగా పతనం కాగా.. నిఫ్టీ 330 పాయింట్లకుపైగా దిగజారింది. రూపాయి పతనం, అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నిర్ణయం ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఈ క్రమంలో స్టాక్ అమ్మకాల నేపథ్యంలో ఒక్కసారిగా కుదేలయ్యాయి. మంగళవారం సెన్సెక్స్ క్రితం సెషన్‌తో పోలిస్తే 81,511.81 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇక మళ్లీ ఏ దశలోనూ కోలుకోలేదు. ఇంట్రాడేలో 81,613.64 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,612.20 పడిపోయింది. చివరకు 1,064.12 పాయింట్లు పతనమై.. 80,684.45 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 332.25 పాయింట్ల నష్టపోయి.. 24,336.00 వద్ద స్థిరపడింది. మార్కెట్‌లో దాదాపు 1,497 షేర్లు పురోగమించగా.. 2,360 షేర్లు పతనమయ్యాయి. మరో 85 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, హీరో మోటోకార్ప్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ టాప్ లూజర్‌గా నిలిచాయి. కేవలం సిప్లా మాత్రమే లాభపడింది. ఆటో, బ్యాంక్, ఎనర్జీ, మెటల్, ఆయిల్, గ్యాస్ షేర్లు శాతం చొప్పున పతనం కాగా.. అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. బీఎస్‌ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.5 శాతం పడిపోయాయి.

Ho no:LIG-32,, Ph No:- 9247842354, 9059207979,near water tank, Bharat Nagar colony, moos-apet, Hyderabad, pin code 500018.